Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 226 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 17 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## సచివాలయంలో ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష



**అమరావతి, (రాజధాని వార్తలు):** జీఎస్డీపీ లక్ష్యాలను సాధించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికలపై సమీక్షలో చర్చ. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక ప్రణాళికలతో ఉత్పాదకతను సాధించేలా లక్ష్యాలను విధించుకోవాలని సీఎం సూచనలు. సమీక్షకు హాజరైన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు.

## రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు : ఏపీ జేఏసీ అమరావతి




**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకున్నందుకు గౌరవ ఆర్థిక శాఖామాత్యులు పయ్యావుల కేశవ్‌కి ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి పలు సందర్భాల్లో చేసిన విజ్ఞప్తులను గౌరవిస్తూ, చెల్లింపుల్లో రిటైర్డ్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం సచివాలయంలో ఆర్థిక మంత్రిని కలిసి రాష్ట్ర నాయకత్వం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసింది. ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అయిన తరువాత సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలు అందకుండానే మరణిస్తున్న దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, అలాగే మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు చెల్లించాల్సిన సెటిల్మెంట్స్ కూడా ఆలస్యమవుతున్నాయని ఏపీ జేఏసీ అమరావతి పలు మార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘంతో పాటు ఆర్థిక శాఖ అధికారులు, చీఫ్ సెక్రటరీతో కూడా అనేకసార్లు చర్చలు జరిపినట్లు తెలిపారు. తీవ్రమైన పనిభారం ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా చర్చించి ఈ చెల్లింపుల ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లడంలో ఆర్థిక మంత్రివర్యులు కీలక పాత్ర పోషించారని, ఇందుకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్ రావు, అసోసియేట్ చైర్మన్ టీ.వీ.ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మ సత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కృషి చేస్తూ, పెన్షనర్లతో పాటు రెగ్యులర్ ఉద్యోగుల పెండింగ్ ప్రయోజనాలు కూడా త్వరితగతిన విడుదల అయ్యేలా ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని రాష్ట్ర నాయకత్వం వెల్లడించింది.

**ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి**

రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు చెల్లించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని ఆర్థిక మంత్రికి నేడు స్టేట్ గవర్నమెంట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం, అమరావతి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా సంపత్‌తో కలిసి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ విషయంపై గౌ ॥ఆర్థిక శాఖ మంత్రివర్యులు సానుకూలంగా స్పందిస్తూ, మంత్రివర్గ ఉప సంఘం వీలైనంత త్వరగా మాట్లాడుకుని, అవసరమైతే ఉద్యోగ సంఘాల సూచనలు కూడా తీసుకుంటామని తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 62 సంవత్సరాలు వరకు రిటైర్మెంట్ వయసు; గత దశాబ్దాలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వయో పరిమితి ఎంత ఉందో అంతవరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా పనిచేసేవారు. గతంలో 60 సంవత్సరాలు వయో పరిమితి ఉన్నప్పుడు కూడా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపజేసేవారు. కానీ ఇటీవల 62 సంవత్సరాలకు వయో పరిమితి పెంచినప్పుడు మాత్రం కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పెంచినందున, మిగిలిన ఉద్యోగులకు పెంచనందున, రాష్ట్రంలోని కొన్ని శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మాత్రం 60 సంవత్సరాలకే రిటైర్మెంట్ చేసి ఇంటికి పంపిస్తున్నందున, ఏ పని చేయలేని ఆ వయసులో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, కనుక రాష్ట్రంలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా 62 సంవత్సరాలకు మాత్రమే రిటైర్మెంట్ చేసేలా తగు ఆదేశాలు ఇవ్వాలని కోరగా, గౌ॥ఆర్థిక శాఖామాత్యులుని కోరగా వారు చాలా సానుకూలంగా స్పందించారు.

## 23న రాష్ట్ర పండుగగా భగీరథ జయంతి

### - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఈ నెల 23న మహర్షి భగీరథుని జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు. ఆరోజు రాష్ట్ర వ్యాప్తంగా భగీరథుని జయంతి అధికారికంగా నిర్వహించేలా కూటమి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సగర కులస్తుల ఆరాధ్య దైవం మహర్షి భగీరథుడన్నారు. ఒంటికాలిపై నిల్చొని, భారీ తపస్సు చేసి, గంగను దివి నుంచి భువి తీసుకొచ్చిన మహనీయుడన్నారు. తన పట్టుదలతో, కఠోర తపస్సుతో భగీరథుడు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారన్నారు. భగీరథుని త్యాగం, పట్టుదల నేటి తరానికి తెలియజేయాలన్న సంకల్పంతో ఆ మహనీయుని జయంతిని ఈ నెల 23న రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించనున్నామన్నారు. కర్నూలులో భగీరథుని రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం చేపట్టనున్నామన్నారు. గతేడాది విశాఖలోని గాజువాకలో అంగరంగ వైభవంగా భగీరథుని రాష్ట్ర స్థాయి జయంతిని నిర్వహించినట్లు మంత్రి సవిత గుర్తు చేశారు.

## ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీలో డిసీజ్ మానిటరింగ్ కేంద్రం ప్రారంభం

### - సోలార్ రూఫ్ టాఫ్ ను ప్రారంభించిన మంత్రి

### - ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీ వీసీ పుల్లెల చంద్రశేఖర్









**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో వ్యాధుల నియంత్రణకు ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు కీలకంగా నిలిచే డిసీజ్ మానిటరింగ్ & డేటా సెంటర్‌ను మంత్రి సత్యకుమార్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో ప్రారంభించారని పి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజారోగ్య పరిరక్షణలో ఇది ఒక ముఖ్యమైన అడుగుగా అభివర్ణించారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రాజెక్ట్ ద్వారా ఈ కేంద్రం కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు.

డీఎండీసీ వద్ద ఉన్న ఆధునిక సాంకేతిక వ్యవస్థల ద్వారా జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో వ్యాప్తి చెందే వ్యాధులను ముందుగానే గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అడ్వాన్స్ వార్నింగ్ అడ్వయిజరీ ఫర్ రీసిలియెంట్ ఎకో సిస్టమ్‌తో ఈ కేంద్రాన్ని అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు ఇవ్వడం, ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించడం సాధ్యమవుతుందని చెప్పారు.

**వైద్య విద్యా రంగానికి మంత్రి ప్రోత్సాహం**

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు అనువుగా గ్రౌండ్ల అభివృద్ధికి ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ ద్వారా ఒక్కో కళాశాలకు రూ. 10 లక్షల చొప్పున కర్నూలు, తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాల ప్రభుత్వ వైద్య కళాశాలలకు ఇప్పటికే నిధులు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా ఫెర్టిలిటీ సంబంధిత పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ కోర్సులను ప్రారంభించాలని విశ్వవిద్యాలయాన్ని కోరారు. కొత్త కోర్సుల ప్రవేశానికి చర్యలు తీసుకుంటున్నాం.. బీఎస్సీ ఫ్యామిలీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫోరెన్సిక్ నర్సింగ్ వంటి కోర్సులను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అలాగే బయోఫిజిక్స్ కోర్సులను ఐఐటీ చెన్నై, ఐఐటీ ఢిల్లీ సహకారంతో ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వీసీ తెలిపారు.

**మౌలిక సదుపాయాల అభివృద్ధికి విజ్ఞప్తి**

విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ తదితర బోధనాసుపత్రుల్లో నిర్మాణాలు చేపట్టేందుకు, అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు విదేశీ నిధుల సమీకరణలో ఉన్న ఎఫ్‌సిఆర్‌ఏ వంటి నిబంధనల్లో సడలింపులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. యూనివర్సిటీలో సోలార్ రూఫుటాఫ్ ను కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారన్నారని వీసీ చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సాయి సుధీర్, డా. లక్ష్మీ సూర్యప్రభ, సిద్దార్థ మెడికల్ కాలేజీ డీన్ శశి, తదితరులు పాల్గొన్నారు.

## ఈ రాజ్యాంగ సవరణ బిల్లు దేశ చరిత్రలోనే గొప్పది : ప్రధాని మోదీ



**ఇంటర్నెట్ డెస్క్:** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. 'పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు.

**అన్ని పార్టీలు మద్దతివ్వండి..**

ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయనివ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే. వారు తమ హక్కుల కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. తమ శక్తి నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ బిల్లు వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఈ విషయంలో రాజకీయం చేయొద్దు. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు.

**తప్పుడు ప్రచారం వద్దు..**

'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ రేపు (శుక్రవారం) ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు.

# రాంబిల్లి మండలంలో రెన్యూ సోలార్ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి

## - ఈనెల 23న ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలోని ఈ నెల 23న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో రాంబిల్లి సెజ్‌లో నిర్వహించనున్న రెన్యూ ఫోటో వోల్టాయిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ భూమి పూజ కార్యక్రమానికి సంబంధించి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకుగాను పటిష్ట ఏర్పాట్లు చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జిల్లా ఎస్పి తుహిన్ సిన్హాతో కలిసి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సుమారు 10 నుంచి 20 వేల మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తూ, అందుకు తగిన విధంగా పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సభావేదిక స్టేజీ ఏర్పాట్లు, విఐపి, వివిఐపి గ్యాలరీ, డెకరేషన్ తదితర ఏర్పాట్లు నిర్దేశిత సమయంలోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాంబిల్లి మండలం గజిరెడ్డిపాలెం సమీపంలో 10 ఎకరాల్లో సభా ప్రాంగణ ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. 15 ఎకరాల విస్తీర్ణంలో పబ్లిక్ పార్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్కింగ్ ప్రదేశంలో ఎల్.ఈ.డి స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి గ్యాలరీలో 500 మంది కూర్చునే విధంగా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్యాలరీకి ఒక ఎంఆర్‌వోను ఇన్‌చార్జ్‌గా నియమించి, కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, ఇతర అవసరాలను సమర్థంగా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలను తరలించేందుకు సుమారు 200 బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి బస్సులో ఉదయం 7 గంటల లోపు తాగునీరు, ఆహారం అందుబాటులో ఉండేలా బస్ ఇన్‌చార్జ్‌లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**భద్రతా ఏర్పాట్లు...**

ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సభా ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించాలని సూచించారు. అదేవిధంగా, వీఐపీ భద్రతకు ప్రత్యేక బందోబస్తు, క్యూలైన్ నిర్వహణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులలో స్పందించేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సభా ప్రాంగణంలో తగినన్ని తాగునీరు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

తగినన్ని మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని వైద్యశాఖను ఆదేశించారు. సభ జరుగనున్న ప్రాంగణం, రహదారులు పూర్తిగా శుభ్రపరచి, శానిటేషన్ పనులు సమగ్రంగా నిర్వహించాలని, తగినన్ని టాయిలెట్లు ఏర్పాటు చేయా లని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా చేరుకునేందుకు మార్గ దర్శక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు, ఆర్డీవో అయేషా, సంబంధిత శాఖల అధికారులు, రెన్యూ సోలార్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో పరిశుభ్రత, భద్రతకు ప్రాధాన్యం - విద్యార్థుల భద్రతపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** విద్యార్థులు సురక్షితమైన మరియు పరిశుభ్రమైన వాతావరణంలో ఉండేలా అన్ని పాఠశాలల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కెజిబివి) మరియు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్‌తో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ ముఖ్యంగా పాఠశాలలో చదువుతున్న పిల్లల భద్రతపై కీలక ఆదేశాలు చేశారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న పొదలు మరియు పిచ్చి మొక్కలు పెరిగిన ప్రాంతాలను పూర్తిగా తొలగించాలన్నారు. పాఠశాల పరిసరాల్లో ఎలాంటి చెత్త లేకుండా పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలన్నారు. పాములు, విషపురుగులు వంటి వాటి నివారణ కోసం స్నేక్ క్యాచర్ ద్వారా క్రమం తప్పకుండా పరిశీలనలు చేయించాలన్నారు. పాఠశాల కాంపౌండ్ గోడల చుట్టూ తరచుగా స్ప్రేయింగ్ చేయించి, విద్యార్థుల భద్రత దృష్ట్యా మొదటి అంతస్తులో నిద్రించేలా ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో సీజనల్ పండ్లు, కూరగాయలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు, ఆరోగ్యం మరియు ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు అజాగ్రత్తగా ఉంటే సహించేది లేదన్నారు. ప్రతి వారం కనీసం ఒకసారి ఎంఈఓలు పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో డిఈఓ అప్పారావు నాయుడు, కెజిబివి పాఠశాలల జిసిడిఓ జెమీమా పాల్గొన్నారు.

# జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలి : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో పర్యాటక ప్రాంతా లను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలక్టరేట్ సమావేశ మందిరంలో అనకాపల్లి జిల్లా పర్యాటక అభివృద్ధికై పర్యాటక మండలి సమావేశం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ఎకో టూరిజం క్రింద కొండ కర్ల ఆవను అభివృద్ధి చేయాలన్నారు. దేవాలయాలను జిల్లాలో గల ప్రాచీన కట్టడాలను, దేవాలయాలను అభివృద్ధి చేసి అందరికీ అందుబాటులోకి తేవాలని అందుకు అవసరమైన నిధులకు జిల్లా కలక్టర్ వారికి, ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బొజ్జన్నకొండను మరింత అభివృద్ధి చేసి పర్యాటకులు పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని టూరిజం అధికారులను ఆదేశించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాల గూర్చి పర్యాటకులకు అవగాహన పెంచే విధంగా ప్రచారం కల్పించా లన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్



శౌర్యమాన్ పటేల్, జిల్లా టూరిజం అధికారి మనోరమ, వివిధ జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ - 2027 సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) లో ప్రజలు భాగస్వామ్యం కావాలి

## - సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో ఎన్యూరేటర్లు, సూపర్వైజర్లు బాధ్యతతో విధులు నిర్వహించాలి - ఏప్రిల్ 16 నుండి 30 వరకు జరుగనున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) కార్యక్రమం ఎన్యుమరేటర్లు విజయవంతంగా పూర్తి చేయాలి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సెన్సెస్ 2027 సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) ప్రజలు భాగస్వామ్యం కావాలని, సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు ఎంతో బాధ్యతతో విధులు నిర్వహించి సకాలంలో త్వరగా పూర్తి చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నగర పరిధిలోని లంకపల్లి బుల్లయ్య కాలేజీలో 2027 జన గణన కార్యక్రమంలో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన)కు సంబంధించి ఎన్యూమురేటర్లు, సూపర్వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్, అడిషనల్ సెన్సస్ అధికారి డి.వి. రమణమూర్తి, ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ కే శివప్రసాద్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ సెన్సస్ 2027 కు సంబంధించిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమం ఏప్రిల్ 16 నుండి 30 వరకు జరుగనున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్( స్వీయ గణన) కార్యక్రమం జరుగుతుందని, స్వీయ గణనలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని, సెల్ఫ్ ఎన్యుమరేషన్ లో ఎన్యూమురేటర్లు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. జనగణన ప్రారంభించి 155 సంవత్సరాలు అయిందని, 1871 నుండి దశలవారీగా జనగణన జరిగినప్పటికీ, 1881లో సంపూర్ణ జన గణన జరిగిందని, అలాగే 2011లో జనగణన చేయడం జరిగిందని ఇప్పుడు దేశంలో మొదటిసారిగా డిజిటల్ విధానంలో జనగణన జరుగుతుందని, ఇది ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. స్వీయ గణన ప్రక్రియను సులభతరం చేసేందుకు వెబ్సైట్ https://se.census.gov.in అందుబాటులో ఉందని, ఈ వెబ్సైట్ లో ప్రజలు స్వయంగా స్వీయ గణనలో నమోదు కావాలని ప్రజలకు అవగాహన పరచాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మొదటి రోజు ఎన్యుమురేటర్లు, సూపర్వైజర్లకు జన గణనకు సంబంధించిన శిక్షణ ఉంటుందని, రెండో రోజు జనగణలలో ఉన్న 33 ప్రశ్నలపై పూర్తి అవగాహన కలిగి ఉండటంపై అవగాహన కార్యక్రమం, మూడో రోజు ఫీల్డ్ లోకి వెళ్లి సర్వేలో పాల్గొనడం మొదలైనవి ఉంటాయన్నారు. ఎన్యుమురేటర్లు జన గణన నిర్వహించేటప్పుడు ప్రజలు అడిగే ప్రశ్నలకు, వారి అనుమానాలను నివృత్తి చేసేందుకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, జనగణన నిర్ణీత సమయంలో త్వరిత గతిన పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మే 1 వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ఈ జనాభా గణన కార్యక్రమం నిర్వహించేందుకు పూర్తిగా శిక్షణ పొందాలని వారికి సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు పిపిపి పద్ధతి ద్వారా ఎన్యుమురేటర్లకు, సూపర్వైజర్లకు శిక్షణకు సంబంధించి అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. ఏప్రిల్ 16 నుండి 30 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ లో స్వీయ గణన లో ఏ విధంగా నిర్వహిస్తారని ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ శిక్షణ పొందుతున్న వారిని ఆరా తీశారు. అనంతరం ఎన్యుమురేటర్లకు, సూపర్వైజర్లకు సంబంధిత నియమాపక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ నాగార్జున, సహాయక వైద్యాధికారి బి. ప్రసాదరావు, రెవిన్యూ ఆఫీసర్లు ఎల్లమనాయుడు, ఏ.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# జన గణన రెండో విడత శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జన గణన -2027 ఎన్యూమరేటర్స్, సూపర్ వైజర్‌ల రెండో విడత శిక్షణ తరగతులు కంచర పాలెం పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. నార్త్ జోన్ జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జోనల్ కమీషనర్ బి.రాము మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ గురువారం నుంచి స్వీయ గణన చేసుకోవచ్చని, ఇది ఈ నెల ఆఖరి వరకు అధికారిక వెబ్సైట్, యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇంటింటి సర్వే వచ్చేనెల ఒకటో తేదీ నుంచి 30 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నార్త్ జోన్ సూపరిండెంట్ శ్రీనివాస్, ఏపీడీ



పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకు పెద్దపీట వేయండి

**- ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి - స్నానాల ఘాట్, పార్కింగ్ ఏరియాలలో అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలి - అన్నదానం, ప్రసాదం పంపిణీ కేంద్రాల వద్ద తోపులాట జరగకుండా అదనపు సిబ్బందిని నియమించాలి - రెవెన్యూ, పోలీస్, దేవదాయ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలి - జొన్నవాడ బ్రహ్మోత్సవాల సమీక్ష సమావేశం సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**









**నెల్లూరు , (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డి పాళెం మండలం జొన్నవాడలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కామాక్షి తాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీ కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాట్లపై సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకై జొన్నవాడ విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆమె రెవెన్యూ, పోలీస్, దేవదాయ, మున్సిపల్ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల పోస్టర్ మరియు పాంప్లెట్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ వీఐపీల కంటే సామాన్య భక్తులకు దర్శనం సులభంగా అయ్యేలా చూడాలని వీఐపీల పేరుతో సామాన్య ప్రజలను క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉంచి ఇబ్బంది పెట్టకూడదని అధికారులకు మరియు ఆలయ బోర్డు సభ్యులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. వేసవి దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్ల పొడవునా చలువ పందిళ్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, ప్రతిచోటా తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. అన్నదానం, ప్రసాదం పంపిణీ కేంద్రాల వద్ద తోపులాట జరగకుండా అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక విశ్రాంతి షెడ్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని. నెల్లూరు నుండి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. వాహనాల రద్దీ పెరగకుండా ఆలయానికి దూరంగా విశాలమైన పార్కింగ్ ప్రదేశాలను కేటాయించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అధికారులకు ఆదేశించారు. స్నానాల ఘాట్, పార్కింగ్ ఏరియాలలో అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని పోలీసు అధికారులకు సూచించారు. మహిళా భక్తుల రక్షణ కోసం మహిళా పోలీసులను దొంగతనాల నివారణకు మఫ్టీలో ఉన్న పోలీసులను నియమించాలని ఆదేశించారు. పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల భద్రత దృష్ట్యా లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. 24/7 వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, ప్రాథమిక చికిత్స మందులు సిద్ధంగా ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో పారిశుధ్య కార్మికులతో ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేయించడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా బ్యాకప్ జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని రెవెన్యూ, పోలీస్, దేవదాయ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో అనూష, ఆలయ పాలకమండలి ఛైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదలకు కూడు, గూడు, గుడ్డ కల్పించడమే టిడిపి విధానం

**- కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా 207 అన్న క్యాంటీన్లు - మలి విడతగా నేడు 67 అన్న క్యాంటీన్ల ప్రారంభం - అన్న క్యాంటీన్లు రోజుకు సుమారు 2 లక్షల 10 వేల మంది ఆకలి తీరుస్తున్నాయి - గత ప్రభుత్వం కక్షపూరితంగా అన్నా క్యాంటీన్లను మూసివేసింది - కోవూరులో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**







**నెల్లూరు , (రాజధాని వార్తలు):** సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు అనే ఎన్టీఆర్ సిద్ధాంతమే తెలుగుదేశం పార్టీకి పునాది అని, ఆ ఆశయ సాధనలో భాగంగానే పేదల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లను పునః ప్రారంభించామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. కోవూరులో నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించారు. అన్న క్యాంటీన్లో భోజనం చేసేందుకు వచ్చిన వారికి ఆమె స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి అక్కడే భోజనం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ నాడు అన్న ఎన్టీఆర్ ఇచ్చిన కూడు, గూడు, గుడ్డ నినాదమే నేడు పేద ప్రజల కోసం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి స్ఫూర్తినిచ్చిందన్నారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా అన్నా క్యాంటీన్లను మూసివేసి పేదల కడుపు కొట్టిందని నేడు కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వీటిని పునరుద్ధరించి రోజుకు సుమారు 2 లక్షల 10 వేల మంది ఆకలి తీరుస్తోందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. కోవూరులో అన్నా క్యాంటీన్ లేదని గతంలో చాలా బాధపడేదానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో నేడు ఇక్కడ క్యాంటీన్ ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామాల నుంచి ఆసుపత్రి పనుల కోసం, ఇతర అవసరాల కోసం కోవూరు వచ్చే పేదలకు కేవలం 5 రూపాయలకే నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడం ప్రభుత్వం యొక్క నిబద్ధతకు నిదర్శనమని ఆమె కొనియాడారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అడుగు జాడల్లో నడుస్తూ, ప్రజా సేవలో ముందుంటానని ఆమె స్పష్టం చేశారు. తనకు పార్టీలో అత్యున్నత నిర్ణయాత్మక కమిటీ అయిన పొలిట్ బ్యూరో సభ్యురాలిగా అవకాశం కల్పించినందుకు చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# పీఆర్సీ ప్రకటించి ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి : ఉపాధ్యాయ సంఘాల డిమాండ్









**నెల్లూరు , (రాజధాని వార్తలు):** ఆధునిక విద్య ద్వారానే సమాజంలో అందరికీ సమాన హక్కులు, గౌరవం దక్కుతాయని మహాత్మా జ్యోతిబా పూలే ఆనాడే చాటిచెప్పారు. పూలే దంపతులతో పాటు, తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్, గుర్రం జాషువా, గురజాడ అప్పారావు వంటి ఎందరో సంఘ సంస్కర్తలు నవభారత నిర్మాణానికి దిశానిర్దేశం చేశారు. ఇలాంటి మహనీయుల జీవిత చరిత్రలను పాఠ్యాంశాల్లో చేర్చాలని, వారి జయంతులను పాఠశాలలు మరియు కళాశాలల్లో ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. అలాగే, విద్యార్థుల్లో మూఢనమ్మకాలను తొలగించి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో జిజ్ఞాస పెంచేలా పాఠ్యపుస్తకాలను రూపొందించాలని కోరారు. మహనీయుల ఆశయ సాధనతో పాటు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పూలే టీచర్స్ ఫెడరేషన్, మహాజన టీచర్స్ అసోసియేషన్, రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ప్రధానంగా మూడు డిమాండ్లను ప్రభుత్వ ముందు ఉంచారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలి. ఇతర బోధనేతర పనుల ఒత్తిడి తగ్గించాలి. ఉద్యోగులకు వెంటనే 30% మధ్యంతర భృతిని ప్రకటించి, తక్షణమే 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి పాఠశాల విద్యలో అకాడమిక్ విషయాలు మరియు ఉపాధ్యాయుల సమస్యలపై రిజిస్టర్ అయిన అన్ని గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం పూర్తి స్థాయి చర్చలు జరపాలి. విద్యా వ్యవస్థ బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఉద్దేశించిన ఈ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు కోరారు ఈ కార్యక్రమంలో పూలే టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం శ్రీనివాసులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసవి సురేష్ జిల్లా నాయకులు రత్నం మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య. రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాజా రహమతుల్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఆహ్వానం పలికిన వేమిరెడ్డి దంపతులు




**నెల్లూరు , (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు ఆహ్వానం పలికారు. ఉదయం నగరంలోని వి పి ఆర్ నివాసానికి చేరుకున్న మంత్రికి వేమిరెడ్డి దంపతులు పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. అనంతరం వివిధ అంశాలపై మంత్రితో చర్చించారు.

# నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్

**నెల్లూరు , (రాజధాని వార్తలు):** నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. నెల్లూరు వీపీఆర్ కన్వెన్షన్‌లో జరిగిన వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులు ప్రజయ్ సేనారెడ్డి, డాక్టర్ జాహ్నవిలను ఆశీర్వదించారు.

పుష్పగుచ్ఛం అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మహిళా బిల్లు.. భారత రాజకీయాల్లో నవశకం!

భారత ప్రజాస్వామ్య చరిత్రలో దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియం' ఒక చరిత్రాత్మక మలుపు. ఇది కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, అబలలు సబలలుగా మారి, దేశ విధాన నిర్ణయాల్లో భాగస్వాములయ్యే సరికొత్త నవ శకానికి నాంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. అయితే, జనాభాలో సగభాగంగా ఉన్న మహిళల ప్రాతినిధ్యం చట్టసభల్లో మాత్రం దశాబ్దాలుగా నామమాత్రంగానే ఉండిపోయింది. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రయాణం ఒక సుదీర్ఘ పోరాటం. దాదాపు 27 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఇది చట్టంగా మారనున్నది. ఈ అసమానతను తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మహిళా రిజర్వేషన్ బిల్లు భారత రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తుంది. 'ఎక్కడ మహిళలు పూజించబడతారో.. అక్కడ దేవతలు కొలువై ఉంటారు' అన్న సూక్తిని అక్షరాలా అమలు చేసిన పార్టీ తెలుగుదేశం. ఆనాడు ఎన్టీఆర్ అడుగడుగునా మహిళలకు ఆత్మగౌరవాన్ని పంచితే, చంద్రబాబు ఆధునిక సాంకేతికతను, ఆర్థిక వనరులను జోడించి మహిళలను ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి స్ఫూర్తినిచ్చిన ఎన్నో విప్లవాత్మక మార్పులు దశాబ్దాల క్రితమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదలయ్యాయి. నేడు పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందనున్న తరుణంలో, తెలుగు నేలపై మహిళల కోసం జరిగిన ఎన్నో విప్లవాత్మక మార్పులు దేశానికే దిశా నిర్దేశం చేస్తున్నాయనడంలో సందేహం లేదు. తెలుగు రాష్ట్రాల్లో మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఇంత చైతన్యవంతంగా ఉండటానికి ఆనాడు ఎన్టీఆర్ వేసిన పునాదే కారణం. మహిళలకు అనేక పథకాలు ప్రకటించి ఆయన మహిళల పక్షపాతిగా నిలిచారు. ఎన్టీఆర్ కేవలం మాటలతో సరిపెట్టకుండా, చేతల్లో మహిళా సాధికారతను చూపించారు. దేశం మొత్తం మహిళా హక్కుల గురించి చర్చించక ముందే, 1986లో హిందూ వారసత్వ చట్టానికి సవరణ చేసి, ఆస్తిలో కుమార్తెలకు సమాన వాటా కల్పించిన ఘనత ఎన్టీఆర్‌ది. సంపూర్ణ మద్యపాన నిషేధంతో కుటుంబ సంక్షేమం కోసం భద్రత కల్పించారు. దేశంలో మొదటి సారిగా రాష్ట్రంలో మహిళలకు ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మహిళల ఉన్నత విద్యాభ్యాసం కోసం తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి, విద్యారంగంలో విప్లవం తెచ్చారు. రాజకీయాల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని భావించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు మొట్ట మొదటిసారిగా తొమ్మిది శాతం రిజర్వేషన్లు కల్పించి, వారిని శాసనకర్తలుగా మార్చిన దార్శనికత ఎన్టీఆర్‌ది. ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ మహిళలకు రిజర్వేషన్ కల్పించడం, చేయదగిన ప్రభుత్వ ఉద్యోగాల్లో 30శాతం వారికే కేటాయించారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థినులకు 33శాతం రిజర్వేషన్ కల్పించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మహిళలకు తెలుగు బాల మహిళా ప్రగతి ప్రాంగణాల ద్వారా వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించారు. ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు హయాం వరకు మహిళాభివృద్ధి కోసం వారు చేసిన నిరంతర కృషి ఫలితమే నేడు జాతీయ స్థాయి మహిళా రిజర్వేషన్ బిల్లు రూపం దాల్చడం. మహిళల నేతృత్వంలో అభివృద్ధిని సాకారం చేసే ఈ చారిత్రక చట్టం ద్వారా దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం మరింత బలపడుతుంది. ఎన్టీఆర్ కల్పించిన చట్టబద్ధమైన హక్కులకు ఆర్థిక బలాన్ని జోడించిన వ్యక్తి చంద్రబాబు. మహిళలను ఓటు బ్యాంకుగా కాకుండా, ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ఆయన లక్ష్యం. గడప దాటని మహిళలను సంఘటితం చేసి పొదుపు మంత్రాన్ని నేర్పి, ప్రపంచంలోనే అతిపెద్ద స్వయం సహాయక బృందాల వ్యవస్థగా డ్వాక్రాను తీర్చిదిద్ది, ప్రతి మహిళను ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చిన వ్యక్తి చంద్రబాబు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేసి, లక్షలాది మహిళలను సర్పంచులుగా, జడ్పీటీసీలుగా తీర్చిదిద్ది రాజకీయ ఓనమాలు నేర్పారు. బాలిక జననంపై రూ.5,000 ఫిక్స్‌డ్ డిపాజిట్, దేశంలోనే తొలి మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు, మహిళల అక్షరాస్యత 25.27శాతం నుంచి గణనీయంగా పెరిగేలా చర్యలు తీసుకున్నారు. మహిళా కమిషన్ ఏర్పాటు, దేశంలోనే తొలి మహిళా స్పీకర్ నియామకం, దేశంలోనే మొదటిసారిగా మహిళా పార్లమెంటు సదస్సు నిర్వహణ, 93 లక్షల మంది మహిళలకు పసుపు-కుంకుమ పథకం తెచ్చారు. పొగచూరిన వంటిళ్ల నుంచి ఆడబిడ్డలకు విముక్తి కలిగించడానికి దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసి, వారి ఆరోగ్యాన్ని కాపాడారు. ఉద్యోగాల్లో 33శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్, 1,20,000 మంది మహిళలు ప్రజాప్రతినిధులు, 15 లక్షల మంది విద్యార్థినులకు ఉచిత సైకిళ్లు, అన్న అమృత హస్తం కింద 10 లక్షల మంది మహిళలకు పోషకాహారం అందించారు. మహిళల పేరుమీద ఇళ్లపట్టాలు, కుట్టు మిషన్లు, రోజుకు 15--25 లక్షల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. ఒంటరి మహిళలకు, వితంతువులకు ఇచ్చే పెన్షన్లను భారీగా పెంచి వారికి అండగా నిలిచారు. చంద్రన్న పెళ్లి కానుక ద్వారా పేదింటి ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక భరోసా కల్పించారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రతిపాదన దాదాపు 27 ఏళ్లుగా వాయిదా పడుతోంది. దేవెగౌడ ప్రభుత్వ హయాం (1996)లో మొదటిసారి 81వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఏకాభిప్రాయం లేక వీగిపోయింది. తర్వాత 1998, 1999, 2002, 2003లో అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం ప్రయత్నించినా, విపక్షాల అభ్యంతరాల వల్ల బిల్లు ఆమోదం పొందలేదు. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో 2010లో రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందింది.

# అప్పన్న అన్నదానంకు రూ. 2 లక్షలు విరాళం అందించిన గంట్ల

## - స్వర్ణ పుష్పాలు స్వర్ణ తులసీదళాలకు అన్నదానంకు గతంలో భారీ విరాళాలు - సింహాద్రి నాథుడు అత్యంత మహిమాన్వితుడు



**సింహాచలం, (రాజధాని వార్తలు):** ప్రపంచంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి బుధవారం సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ నాయకులు గంట్ల శ్రీనుబాబు రెండు లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని భక్తులకు అన్న ప్రసాద వితరణకు వినియోగించాలని ఆలయ అధికారులను గంట్ల శ్రీనుబాబు కోరారు. తొలుత సింహాద్రినాథుడు శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు తన కుటుంబ సభ్యులతో కలిసి గంట్ల శ్రీనుబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీస్సులు స్వీకరించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసచార్యులు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. తిరుమలేశ్వర్ రావ్ పర్యవేక్షకులు కె. వెంకటేశ్వరరావులకు ఈ విరాళం అందజేయడం జరిగింది. గతంలో కూడా స్వర్ణ పుష్పాలు స్వర్ణ తులసీ దళాలు అన్న ప్రసాద వితరణకు 3 లక్షలు స్వర్ణ కవచ అలంకరణకు అవసరమైన 27 కేజీలు ఇత్తడి ఇంకా వస్తు రూపంలో కొంత సామాగ్రి అందజేసినట్లు గంట్ల శ్రీనుబాబు ఈ సందర్భంగా చెప్పారు. సింహాద్రి నాథుడు అత్యంత మహిమాన్వితులని అటువంటి స్వామి అవతరించిన సింహాచలం గ్రామంలో జన్మించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు శ్రీనుబాబు తెలిపారు. కోవిడ్ సమయంలో ఎంతోమంది కోటీశ్వరులు మృత్యువాత పడ్డారని కాబట్టి ఉన్నంతలోనే ఏదైనా చేయాలన్నది అనుకున్నది చేసేయడమే తన సంకల్పంగా చెప్పారు. దానం శాశ్వతమని ధనం అశాశ్వతమని ఆ సిద్ధాంతాన్ని నమ్మి తాను తన పరిధి మేరకు ఆ స్వామి సేవలోనే గడుపుతానన్నారు. సిరిలొలికించే సింహాద్రి నాథుడు ఆశీస్సులతోనే తమ కుటుంబం ముందుకు సాగుతుందన్నారు.

# సూరిబాబు రాజుకు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పదవి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా నియమితులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజును బుధవారం పలువురు అభినందించారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయంపై పెద్దాపురం నియోజక వర్గానికి చెందిన పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు బుధవారం ఉదయం నుంచి నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు, అభిమానులు రాజా సూరి బాబు రాజులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సూరిబాబు రాజు మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు ఈ రాష్ట్ర పదవిని అప్పగించినట్టు చెప్పారు. దీనితో పార్టీలో తమ బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. రానున్న రోజుల్లో నియోజక వర్గంలో, జిల్లాలో తెలుగు దేశం పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా తాను కృషి చేయనున్నట్టు సూరిబాబు రాజు తెలిపారు.

# ఘనంగా కొబ్బరితోట గ్రామదేవత శ్రీశ్రీశ్రీ దుర్గాలమ్మవారి జాతర మహోత్సవం

## - ముఖ్య అతిథిగా పాల్గొన్న దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ - బాణా సంచా, సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తిన కొబ్బరితోట





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 34వ వార్డు, కొబ్బరి తోట గ్రామదేవత శ్రీశ్రీశ్రీ దుర్గాలమ్మవారి జాతర మహోత్సవంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కి ఆలయ కమిటీ మరియు నిర్వహకులు కూటమి శ్రేణులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసినా సాంస్కృతి కార్యక్రమాన్ని కాసేపు తిలకించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలు అనుగుణంగా నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయుటలో తాను ముందు ఉంటానని హామీ ఇచ్చారు. అమ్మవారి జాతర మహోత్సవములు ఘనంగా జరగడానికి సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కూటమి శ్రేణులు మరియు పాల్గొన్నారు.



# మెదడు అభివృద్ధి ప్రేరణపై అవగాహన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఎనిమిదవ పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం సామర్లకోట మున్సిపాలిటీలోని సత్యనారాయణపురం అంగన్వాడి కేంద్రంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి ఆదేశాల మేరకు పెద్దాపురం ప్రాజెక్ట్ సిడిపిఓ జి.ఉషా ఆధ్వర్యంలో గర్భవతులకు, బాలింతలు, కమ్యూనిటీకి మాతా శిశు ఆరోగ్యం, పోషణ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మూడు సంవత్సరాల్లో పిల్లలకు మెదడు అభివృద్ధికి ప్రేరణ కల్పించడంపై అవగాహన కల్పించారు. అలాగే పిల్లల తల్లిదండ్రుల నుండి సాఫ్ట్ టాయ్స్ సేకరించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుల్తాన్ బీబి, అంగన్వాడీ టీచర్ కె అనిత, ఎఎన్ఎం. ఎం బేబీ ఆశ వర్కర్లు ఎస్ సింహాచలం, అనంతలక్ష్మి, పి.రత్నం, తల్లులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు సహకారం మరపురానిది

## - నిరంతరం పరిధి మేరకు అండగా ఉంటా - మూడు పత్రికలు 30 సంవత్సరాలు - పుట్టినరోజు వేడుకలలో గంట్ల





**అక్కయ్యపాలెం, (రాజధాని వార్తలు):** మూడు దశాబ్దాల పాత్రికేయ రంగంలో ఎంతోమంది జర్నలిస్టులు తనకు అందించిన సహకారం మరుపురానిదని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అన్నారు. బుధవారం అక్కయ్యపాలెం జంక్షన్ సమీపంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో గంట్ల శ్రీనుబాబు పుట్టిన రోజు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జర్నలిస్టు మిత్రులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ 30 ఏళ్ల జర్నలిస్టు జీవితంలో వారం రోజులు మినహా మిగిలిన అన్ని రోజులు తన విధి నిర్వహణలోనే కొనసాగానన్నారు. సూర్యప్రభ ఆంధ్రజ్యోతి ఆంధ్రప్రభ గ్రూప్ సంస్థల్లో మాత్రమే తాను విధులు వేరు వేరు హోదాల్లో నిర్వహించడం జరిగిందన్నారు. తనకు జర్నలిస్టుల మిత్రులు సంపూర్ణంగా సహకరించారని వారికి తన పరిధి మేరకు నిరంతరం అండగా ఉంటాను అన్నారు. ప్రతి ఒక్కరికి సహాయం చేయాలనే సంకల్పంతోనే తాను ఎప్పుడూ ముందుకు సాగుతానన్నారు. తనకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలతో పాటు జిల్లా జాతీయ స్థాయి పురస్కారాలు 25 వరకు వరించాయని అవన్నీ కూడా జర్నలిస్టు మిత్రులకు అంకితం అన్నారు. ప్రతి ఒక్కరూ తనకు సోదర సమానులనీ కులమతాలకు అతీతంగా అందరికీ సహాయకారిగా ఉంటానన్నారు. భవిష్యత్తులో కూడా యూనియన్లకు అతీతంగా తాను సేవలందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు గంట్ల శ్రీనుబాబు కుటుంబ సభ్యులకు ఆశీస్సులు అందజేశారు. అలాగే జర్నలిస్ట్ మిత్రులందరూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయులు పి నారాయణ సమన్వయకర్తగా వ్యవహరించారు. అలాగే సన్నిహితులు తోట దుర్గారావు భక్తులు చిరంజీవి కలిమిరెడ్డి అప్పారావుతో పాటు అనేకమంది జర్నలిస్టు మిత్రులు అభిమానులు సన్నిహితులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు, కేసులకు వైయస్ఆర్సీపీ శ్రేణులు భయపడరు: మాజీ ఎంపీ అనురాధ



**అల్లవరం, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన ఇంటి వద్ద కలిసి ఇంటికి వెళ్తున్న వైయస్ఆర్‌సీపీ మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరిని మఫ్టీలో వచ్చిన పోలీసులు నోటీసు ఇవ్వకుండా ఏ స్టేషన్‌కు తీసుకెళ్తున్నారో చెప్పకుండా బలవంతంగా తీసుకెళ్లడాన్ని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ తీవ్రంగా ఖండించారు. ఇది పోలీసులు చేసే అరెస్ట్ లా కాకుండా ఒక ప్రైవేట్ గ్యాంగ్ కిడ్నాప్ చేసినట్లు ఉందని అనురాధ అగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులపై ఇలా తప్పుడు కేసులు పెట్టి ఎంతకాలం వేధిస్తారంటూ ఆమె ప్రశ్నించారు. ఒకవైపు సోషల్ మీడియాలో వైయస్ జగన్‌మోహన్ రెడ్డిపై దుర్మార్గం గా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వారిని వదిలేసి నిజాన్ని నిర్భయంగా బయటపెడుతున్న వైయస్ ఆర్సీపీ శ్రేణులపై కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న "రెడ్ బుక్" అహంకారాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై ఈ స్థాయి దృష్టి పెట్టి ఉంటే రాష్ట్రం నిజంగా అభివృద్ధి చెందేదని అన్నారు. ఇటువంటి అక్రమ అరెస్టులు, కేసులకు, దౌర్జన్యాలకు వైయస్ఆర్సీపీ భయపడదని నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ గుర్తించాలని వెంటనే పూడి శ్రీహరిని విడుదల చేయాలని అనురాధ డిమాండ్ చేశారు.


# తమన్నాకు పెద్ద షాక్.. మద్రాసు హైకోర్టు ఏం చెప్పిందంటే?



సౌత్ స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాకు మద్రాస్ హైకోర్టులో తాజాగా షాక్ తగిలింది. తన పర్మిషన్ లేకుండా ఫోటోలు కమర్షియల్ యాడ్స్ కోసం వినియోగించారంటూ వేసిన రూ.1 కోటి పరిహారం పిటిషన్‌ను హైకోర్టు కొట్టి వేసింది. విచారణ జరిపిన న్యాయస్థానం, సరైన ఆధారాలు చూపలేకపోయారని పేర్కొంటూ ఆమె అప్పీల్‌ను రిజెక్ట్ చేసింది. వివరాల్లోకి వెళితే.. 2008లో పవర్ సోప్స్ లిమిటెడ్ అనే సబ్బుల తయారీ సంస్థతో తమన్నా ఒక యాడ్స్ అగ్రిమెంట్‌ను కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం ఆమె చిత్రాలను ఆ సంస్థ ప్రొడక్టులు ప్రచారం చేసుకోవడానికి ప్రచారానికి ఒక ఏడాది పాటు మాత్రమే వినియోగించుకోవడానికి అనుమతి ఉంది. ఈ గడువు అక్టోబర్ 2009తో ముగిసింది. అయితే, ఒప్పందం ముగిసిన తర్వాత కూడా 2010 నవంబర్ నుంచి 2011 ఫిబ్రవరి మధ్యకాలంలో తన ఫోటోలను సబ్బు ర్యాపర్లు, బ్యానర్లు, పోస్టర్‌పై అక్రమంగా వాడుకున్నారని తమన్నా ఆరోపించారు. దీనివల్ల తనకు ఆర్థిక నష్టం కలిగిందని, ప్రతిష్ఠకు భంగం కలిగిందని చెబుతూ 2011లో సివిల్ కోర్టును ఆశ్రయించారు. సంస్థ నుంచి రూ. కోటి పరిహారం ఇప్పించాలని ఆమె కోరారు. ఆ కేసు విచారణలో భాగంగా, గతంలో 2017లో ఒక సింగిల్ జడ్జి తమన్నా వాదనలను తిరస్కరించారు. సంస్థపై ఆరోపణలు నిరూపించడానికి ఆధారాలు లేవని అప్పట్లోనే కోర్టు స్పష్టం చేసింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ తమన్నా అప్పీల్ దాఖలు చేశారు. ఆ అప్పీల్‌పై విచారణ జరిపిన జస్టిస్ పి.వేల్ మురుగన్, జస్టిస్ కె.గోవిందరాజన్ తిలకవతి ధర్మాసనం 2026 ఏప్రిల్ 16న తుది తీర్పు వెలువరించింది. ఒప్పందం గడువు ముగిసిన తర్వాత కూడా సంస్థ ఆమె చిత్రాలు వాడుకుందని నిరూపించే స్పష్టమైన ఆధారాలు లేవని మద్రాసు హైకోర్టు అభిప్రాయపడింది. ఇక ఆ కేసులో తమన్నా వాదనల్లో స్పష్టత లేకపోవడం, నష్టం జరిగినట్లు నిరూపించే సరైన సాక్ష్యాలు లేకపోవడం కూడా కోర్టు గమనించింది. కేవలం ఆరోపణలు మాత్రం సరిపోవని, చట్టపరంగా బలమైన ఆధారాలు అవసరమని పేర్కొంది.

అలాగే, సంస్థ చర్యల వల్ల తమన్నా ప్రతిష్ఠకు భంగం కలిగిందని నిరూపించే అంశాలు కోర్టు ముందు ఉం చలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో రూ.1 కోటి పరిహారం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో 2017లో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు ధర్మాసనం సమర్థిస్తూ, తమన్నా దాఖలు చేసిన అప్పీల్ ను పూర్తిగా కొట్టి వేసింది. ఆ తీర్పుతో తమన్నాకు చట్టపరంగా షాక్ తగిలినట్లయింది. ఒప్పందాలు, బ్రాండ్ ఎండార్స్మెంట్ విషయంలో సరైన ఆధారాలు ఎంత ముఖ్యమో ఆ కేసు మరోసారి గుర్తు చేసిందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఆ హీరో కోసం సారా-ఖుషీ కపూర్ పోటాపోటీ!





కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 56వ చిత్రం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాలో ధనుష్ సరసన నటించే కథానాయిక ఎంపిక విషయంలో చిత్ర బృందం కసరత్తులు మొదలు పెట్టింది. ధనుష్ సినిమాల్లో కథానాయిక పాత్రలకు మంచి ప్రాధాన్యత ఉంటుంది. నాలుగు పాటలకు..రొమాంటిక్ సన్నివేశాలకు నాయిక పరిమితం కాదు. హీరో రోల్‌కు ధీటుగా నాయిక పాత్రను ధనుష్ కోరుకుంటాడు. ఈ నేపథ్యంలో నాయిక ఎంపిక విషయంలోనూ దర్శకులు అంతే జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో కన్నడ భామ రుక్మిణీ వసంత్‌ను కథానాయికగా ఎంపిక చేయాలని చిత్ర యూనిట్ భావించింది. దాదాపు అమె ఎంట్రీ కూడా ఖరారైంది. అయితే అమ్మడి బిజీ షెడ్యూల్ కారణంగా ప్రాజెక్ట్ వదులుకుంటుంది. ఎంత ప్రయత్నించినా డేట్స్ సర్దుబాటు చేయలేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టు నుండి తప్పుకుందని సమాచారం. రుక్మిణి తప్పుకోవడంతో ఇప్పుడు ఆ స్థానం కోసం బాలీవుడ్ బ్యూటీ సారా అలీ ఖాన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలోనే దక్షిణాది సినిమాల్లో నటించాలని సారా తన మనసులోని మాటను బయటపెట్టింది. ధనుష్ వంటి జాతీయ అవార్డు గ్రహీత సరసన నటించడం తన కెరీర్‌కు ప్లస్ అవుతుందని ఆమె భావిస్తోంది. ధురంధర్ సినిమాతో పాన్ ఇండియాలోనూ అమ్మడికి మంచి గుర్తింపు దక్కింది. తెలుగులో యూఫోరియా సినిమాతోనూ లాంచ్ అయింది. అయితే తమిళ్ లో మాత్రం ఇంకా లాంచ్ అవ్వలేదు. ఆ చాన్స్ ధనుష్ కల్పిస్తాడని అమ్మడు ఆశీస్తోంది. అయితే సారా అర్జున్ కు పోటీగా అతిలోక సుందరి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ కూడా ఈ రేసులో వినిపిస్తోంది.

ది ఆర్చీస్ సినిమాతో వెండితెరకు పరిచయమైన ఖుషీ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు కోసం ప్రయత్నిస్తోంది. శ్రీదేవి వారసురాలిగా సౌత్ ఇండస్ట్రీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడానికి ధనుష్ సినిమా కంటే మెరుగైన ఆప్షన్ మరొకటి ఉండదని అమ్మడు భావిస్తోంది.

దీంతో ఖుషీ కూడా ఈ పాత్రను దక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కోలీవుడ్ మీడియా కథనాలు వెడెక్కిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హీరోయిన్ ఎంపిక మేకర్స్‌కు సవాల్‌గా మారే ఛాన్స్ ఉంది. సారా అలీ ఖాన్‌కు ఉన్న అనుభవం, ఖుషీ కపూర్‌కు ఉన్న ఫ్రెష్ లుక్ మధ్య చిత్ర యూనిట్ తర్జనభర్జన తప్పదు. ప్రస్తుతానికి ఇద్దరు నటీమణులతో ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయని త్వరలోనే ఒకరిని ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ధనుష్ మార్కెట్ క్రేజ్ దృష్ట్యా సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. మరి సారా అలీఖాన్ తన అనుభవంతో ఈ ఛాన్స్ కొట్టేస్తుందా? లేక ఖుషీ కపూర్ అదృష్టంతో, మామ్ ఇమేజ్ తో చేజిక్కించుకుంటుందా? అన్నది చూడాలి. తమిళరసన్ పచ్చముత్తు ఈ చిత్రానికి దర్శకుడిగా వ్యవహరి స్తున్నారు.

# వృషకర్మ రిలీజ్ డేట్.. నాగచైతన్య అప్డేట్!



అక్కినేని అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. 'విరూపాక్ష' డైరెక్టర్ కార్తీక్ దండు దర్శకత్వంలో చైతన్య చేస్తున్న ఈ సినిమా టీజర్‌తోనే అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా ఈ సినిమా షూటింగ్ ఎంతవరకు వచ్చింది? ఎప్పుడు విడుదల కాబోతోంది? అనే విషయాలపై చైతన్య స్వయంగా క్లారిటీ ఇచ్చారు. సినిమా బడ్జెట్ నుంచి విలన్ వరకు అన్నీ ఆసక్తికరంగా ఉన్న ఈ ప్రాజెక్ట్ గురించిన మరిన్ని విశేషాలు చూద్దాం..

**షూటింగ్ క్లైమాక్స్‌కు - చైతన్య ఖుషి:**

నాగచైతన్య తన కెరీర్‌లో ముందెన్నడూ చేయని ఒక విభిన్నమైన రోల్‌లో ఈ సినిమాలో కనిపించబోతున్నారు. తాజాగా మీడియా ఇంటరాక్షన్‌లో చైతూ మాట్లాడుతూ, సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుందని వెల్లడించారు. ఇక ఇప్పటికే 85 శాతం చిత్రీకరణ పూర్తయిందని, కేవలం 15 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఆ కొద్ది భాగాన్ని కూడా చకచకా పూర్తి చేసి, ఈ ఏడాది ద్వితీయార్థంలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. అవుట్‌పుట్ చూశాక చైతన్య ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉండటం విశేషం.

**చైతూ కెరీర్‌లోనే భారీ బడ్జెట్:**

ఈ సినిమాను నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ ఏకంగా 120 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. నాగచైతన్య మార్కెట్ దృష్ట్యా ఇది చాలా పెద్ద రిస్క్ అయినప్పటికీ, కథ మీద ఉన్న నమ్మకంతో మేకర్స్ ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ఇక ఈ ప్యాన్-ఇండియా చిత్రానికి సుకుమార్ రైటింగ్స్ కూడా సహకారం అందిస్తుండటం సినిమాపై క్రేజ్‌ను డబుల్ చేసింది. 'వృషకర్మ'లో విజువల్స్ మరియు మిస్టరీ ఎలిమెంట్స్ హాలీవుడ్ స్థాయిలో ఉంటాయని ఇండస్ట్రీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.


**క్రేజీ కాస్టింగ్ - మీనాక్షి చౌదరి, స్పర్ష్ శ్రీవాస్తవ:**

సినిమాలో నాగచైతన్యకు జోడీగా టాలెంటెడ్ బ్యూటీ మీనాక్షి చౌదరి నటిస్తోంది. అయితే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోతున్నది ఎవరంటే లాపతా లేడీస్ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన స్పర్ష్ శ్రీవాస్తవ. ఈ సినిమాలో ఆయన విలన్ ఒక పవర్‌ఫుల్ రోల్‌లో మెరవబోతున్నారు. హీరో, విలన్ మధ్య జరిగే మైండ్ గేమ్స్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లు ఆడియన్స్‌ను థ్రిల్ చేస్తాయని తెలుస్తోంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం ఈ మిస్టికల్ అడ్వెంచర్‌కు ప్రాణం పోయనుంది.

**అక్కినేని ఫ్యాన్స్‌కు పండగే:**

చివరగా, 'వృషకర్మ' సినిమాతో నాగచైతన్య తన బాక్సాఫీస్ సత్తా చాటుతారని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు. కార్తీక్ దండు 'విరూపాక్ష'తో ఎలాగైతే థ్రిల్ చేశారో, అంతకుమించి ఈ సినిమాలో మ్యాజిక్ ఉండబోతోందని సమాచారం. ఇక షూటింగ్ పూర్తయిన వెంటనే గ్రాండ్ లెవల్‌లో ప్రమోషన్స్ ప్రారంభించి, విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నారు. 120 కోట్ల భారీ బడ్జెట్, మిస్టికల్ కథాంశం వెరసి ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద చైతన్యకు ఒక సాలిడ్ హిట్ దక్కుతుందని ఆశిద్దాం.

# 'పాపం ప్రతాప్'.. రిలీజ్‌కు ముందు సమస్యేంటి?



టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు తిరువీర్ హీరోగా నటించిన తాజా చిత్రం పాపం ప్రతాప్ విడుదలకు ముందే అనుకోని ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదలకు సిద్ధమైన ఆ సినిమా కోసం మేకర్స్ ఈరోజు (ఏప్రిల్ 16) రాత్రి పెయిడ్ ప్రీమియర్లను ప్లాన్ చేశారు. అయితే చివరి నిమిషంలో వచ్చిన సాంకేతిక సమస్యల కారణంగా ఆ ప్రీమియర్లు రద్దు అయ్యాయి. ఆ పరిస్థితికి ప్రధాన కారణం యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ సర్టిఫికెట్ ఆలస్యం కావడమేనని సమాచారం. సినిమాలో కొన్ని జంతువులకు సంబంధించిన సన్నివేశాలు ఉండటంతో, సెన్సార్ క్లియరెన్స్ కోసం ఆ సర్టిఫికెట్ తప్పనిసరి అయింది. సాధారణంగా సినిమా షూటింగ్‌లో ఏ జంతువుకూ హాని జరగలేదని నిర్ధారిస్తూ యానిమల్ బోర్డ్ నుంచి అనుమతి పొందాలి. అయితే ఆ ప్రక్రియ చివరి దశలో నిలిచిపోవడంతో సెన్సార్ ఫార్మాలిటీస్ పూర్తి కాలేదు. దీంతో గురువారం రాత్రి పడాల్సిన ప్రీమియర్ షోలను నిలిపివేయాల్సి వచ్చింది. మేకర్స్ ప్రస్తుతం ఆ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం షోల నుంచి సినిమాను థియేటర్లలోకి తీసుకురావాలని చిత్ర బృందం కృషి చేస్తోంది. అయితే సర్టిఫికెట్ సమయానికి వస్తుందా లేదా అన్నది కీలకంగా మారింది. పాపం ప్రతాప్ సినిమా విషయంలో హీరో తిరువీర్ చాలా ఆశలు పెట్టుకున్నారు. తన గత చిత్రాలకు విమర్శకుల ప్రశంసలు వచ్చినప్పటికీ, థియేటర్లలో ఆశించిన స్థాయిలో ఆదరణ లభించలేదని ఆయన గతంలోనే పలు సందర్భాల్లో చెప్పారు. ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లో తన సినిమాలకు మంచి స్పందన వస్తోందని, కానీ థియేటర్లలో అదే స్థాయి సక్సెస్ రావడం లేదని తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పాపం ప్రతాప్‌తో థియేటర్లలో హిట్ కొట్టాలని తిరువీర్ ఎంతో నమ్మకంగా ఉన్నారు. అందుకే ముందుగానే ప్రీమియర్లు కూడా ప్లాన్ చేశారు. కానీ, చివరి నిమిషంలో యానిమల్ సర్టిఫికెట్ ఇబ్బంది తలెత్తడంతో సోషల్ మీడియాలో నెటిజన్లు పాపం తిరువీర్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఆ చిత్రాన్ని దుర్గా నరేష్ దర్శకత్వంలో రూపొందించారు. రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఆ సినిమా కథ 1990ల చివరలో గోదావరి ప్రాంతం నేపథ్యంలో సాగుతుంది. పెళ్లైన నాలుగు రోజులకే భార్య వెళ్లిపోవడంతో హీరో ఎదుర్కొనే పరిస్థితులను ఫన్నీగా చూపించనున్నారు. ఏదేమైనా ఇప్పుడు అందరి దృష్టి యానిమల్ బోర్డ్ సర్టిఫికెట్ పై నిలిచింది. అది సమయానికి వస్తేనే సినిమా నిర్ణయించిన తేదీకి విడుదల అవుతుంది. లేకపోతే వాయిదా పడే అవకాశం ఉంది. మరి ఆ అడ్డంకిని అధిగమించి పాపం ప్రతాప్ థియేటర్లలోకి ఎప్పుడు వస్తుందో చూడాలి.

# ప్రజా క్షేత్రంలోనే కార్యకర్తగా పనిచేస్తాం

**- మా ఇరువురిలో పదవి ఎవరికిచ్చినా ఒక్కటే - పార్టీకి కట్టుబడి పని చేస్తా - పొరపాటు, తప్పు ఉంటే నేరుగా వచ్చి మాకు చెప్పండి : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టీ అత్యున్నత పదవి పొలిటి బ్యూరోలో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి స్థానం కల్పించిన ముఖ్య మంత్రి చంద్రబాబు వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తామని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేసారు. అత్యున్నత పదవి వచ్చిందని ఆకాశంలో నడవబోమని, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేస్తామన్నారు. తనకు పదవి వచ్చిన ప్రశాంతి రెడ్డికి వచ్చిన ఒకటే అని ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి మరియు కోవూరు నియోజకవర్గ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఖరిపై ప్రశాంతి రెడ్డి తీవ్రస్థా యిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నా భిన్నం చేసిన జగన్ ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. నెల్లూరు జిల్లాలోని మత్స్యకారులను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజ నం పొందాలని చూస్తున్న జగన్ ప్రయత్నాలు విఫలమవుతాయని, మత్స్యకారులందరూ కూటమి ప్రభుత్వం వెంటే ఉన్నారని ఆమె స్పష్టం చేశారు. జువ్వలదిన్నెలో యువతకు ఉపాధి కల్పించాలని మంత్రి లోకేష్ ప్రారంభించిన డిఫెన్స్ పరిశ్రమ అడ్డుకోవాలని జగన్మోహన్రెడ్డి కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. తన హయాంలో ఏం చేశారో చెప్పుకోలేక తానొస్తే అది చేస్తా.. ఇది చేస్తానని ప్రజలను ప్రలోభ పెడుతున్నారన్నారు. అనంతరం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి పొలిట్ బ్యూరో సభ్యురాలిగా అవకాశం కల్పిం చడం పట్ల చంద్రబాబు నాయుడు, లోకేష్కి కృతజ్ఞతలు తెలి పారు. ఈ పదవిని ఒక అలంకారంగా కాకుండా బాధ్యతగా భావిస్తున్నామని, పార్టీ మరియు కార్యకర్తల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. టీడీపీలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందని, క్రమశిక్షణ మరియు గౌరవం ఉన్న ఇటువంటి పార్టీలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఉన్నత పదవులు దక్కినప్పటికీ సామాన్య కార్యకర్తల్లాగే ప్రజలకు అందుబాటులో ఉంటూ, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని ఎంపీ వెల్లడించారు.

# కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి టిడిపి అత్యున్నత నిర్ణయాత్మక కమిటి పొలిట్ బ్యూరో సభ్యులురాలిగా నియామకం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి టీడీపీ పొలిట్ బ్యూరోలో చోటు.. హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా టిడిపి నేతలు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించడంపై కోవూరులో మిన్నంటిన సంబరాలు. సమర్ధురాలైన నాయకురాలిని గుర్తించిన అధినేతకు ధన్యవాదాలు తెలుపుతున్న నెల్లూరు జిల్లా టీడీపీ శ్రేణులు. రాజకీయాల్లో మహిళలు రాణించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి అత్యున్నత బాధ్యతలు ఇచ్చినందుకు టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్లకు కృతజ్ఞతలు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నియామకంతో నెల్లూరు జిల్లాలో తిరుగులేని శక్తిగా టీడీపీ.. జోష్లో క్యాడర్. రాష్ట్ర స్థాయి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించనున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోవూరు నియోజకవర్గంలో వెల్లివిరిసిన ఆనందం. పదవి ఏదైనా బాధ్యతగా భావించే ప్రశాంతి రెడ్డి పొలిట్ బ్యూరోలో చేరడం జిల్లాకు గర్వకారణం.

# ఉటుకూరు, పొన్నపూడి పట్టపుపాలెం బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

**- మంత్రి బిసి జనార్ధన్ రెడ్డికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మెమొరాండం అందజేత**
**- శిథిలమై స్లాబ్ పెచ్చులూడి పిల్లర్లు బలహీనపడటంతో ఏ క్షణమైనా కుప్పకూలేలా వుంది**
**- పొన్నపూడి పట్టపుపాలెం వంతెన నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మనవి**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరం మాగుంట లేఔట్ లోని విపిఆర్ నివాసానికి విచ్చేసిన రాష్ట రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విడవలూరు మండలం ఉటుకూరు, పొన్నపూడి పట్టపుపాలెం వంతెన దుస్థితిని వివరించారు. బకింగ్ హాం కెనాల్పై 8వ కిలో మీటర్ వద్ద శిథిలావస్థకు చేరిన పాత వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించవలసిందిగా మంత్రి బిసి జనార్ధన్ రెడ్డికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మంత్రి బిసి జనార్దన్ రెడ్డికి పరిష్టితి త్రీవతను వివరిస్తూ బకింగ్ హాం కెనాల్ పై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలమై స్లాబ్ పెచ్చులూడి పిల్లర్లు బలహీనపడటంతో ఏ క్షణమైనా కుప్పకూలేలా ఉందన్నారు. ఈ రహదారి తీరప్రాంత మత్స్యకారుల రవాణాకు మరియు స్థానిక గ్రామస్తుల నిత్య అవసరాలకు వెన్నెముక వంటిదన్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ మార్గంలో వంతెన పరిస్థితి దారుణంగా ఉండటంతో, ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజల ప్రాణ రక్షణ మరియు రవాణా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సుమారు 6 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో నూతన వంతెన నిర్మించాలని కోరారు. ఉటుకూరు, పొన్నపూడి పట్టపుపాలెం వంతెనకు సంబంధించి రోడ్ల భవనాల శాఖ ఇంజనీర్–ఇన్–చీఫ్ నుండి సమగ్ర నివేదికను తెప్పించుకుని అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా తక్షణమే పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి విజ్ఞప్తి చేశారు. జరగరాని ఘటన జరగకముందే ప్రభుత్వం స్పందించి ఉటుకూరు, పొన్నపూడి పట్టపుపాలెం వంతెన నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మనవి చేశారు.

# జిల్లా ఇంజనీర్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస సింగ్ సేవలు ఎనలేనిది

**- రాష్ట్ర సంఘ నేతలతో ఘనంగా సత్కారం అందుకొన్న శ్రీనివాస సింగ్**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా అసోసియేషన్ ఇంజనీర్ శ్రీనివాస్ సింగ్ చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయి నేతలు ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించి ఆయన చేసిన సేవలని అసోసియేషన్ కొనియాడింది. నెల్లూరులో బుధవారం నిర్వహించిన నెల్లూరు జిల్లా ఇంజనీర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్బంగా ఈ సమావేశము నెల్లూరు జిల్లా ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేటకు చెందిన బొందిలి శ్రీనివాస్ రాష్ట్ర బొందిలి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మరియు ఇంజనీర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా హాజరై కార్యక్రమను సఫలీకృతం చేసారు ఆయన సమక్షంములో సమావేశం ఘనంగా జరిగింది. ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ సింగ్ సేవలను, కృషిని గుర్తించి, ఆయనను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సత్కారం ఆయన ఇంజనీరింగ్ రంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా నిలిచింది. ఈ సమావేశం ద్వారా ఇంజనీర్ల ఐక్యత, సేవాభావం మరియు సమాజానికి వారి కట్టుబాటు మరింత బలపడినట్లు భావించవచ్చునని పలువురు కొనియాడారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపండి : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయండి - స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులకు సామాన్య ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలి**
**- ప్రజాదర్బార్ లో జాయింట్ కలెక్టర్కు ఫోన్ చేసి రీ సర్వేలో పొరపాట్లు, పేదల నివాస స్థలాల కేటాయింపులో చొరవ చూపాలని సూచన**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటికి పరిష్కారాలు చూపడానికే ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఇందుకూరు పేట మండలంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతో ప్రజా దర్బార్కు వచ్చే ప్రతి ఒక్కరు ఏదో ఒక సమస్యతో మన వద్దకు వస్తారని వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ప్రజల నుంచి ఇంటి పట్టాలు, రీ సర్వే సంబంధ సమస్యల పై ఎక్కువగా వినతి పత్రాలు రావడం చూసిన ఆమె వేదిక పై నుంచే జాయింట్ కలెక్టర్కి ఫోన్ చేసి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలని చెప్పారు. చాలా గ్రామాలలో తాగునీరు, డ్రైన్లు, స్మశాన వాటికల స్థలాల సమస్యలు తన దృష్టికి వచ్చాయని దశల వారీగా ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేటానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా హామీ యిచ్చారు. ఒక అర్జీ ఇస్తే, అది ఎన్ని రోజుల్లో పరిష్కారం అవుతుందో ప్రజలకు వివరించి మానవతా ధృక్పదంతో ఎలా సహాయం చేయవచ్చో అలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ప్రజాప్రతినిధులు అధికార యంత్రాం గానికి, సామాన్య ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కోవూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్య సాధనలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు భాగస్వా ములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దారు మురళి ఎంపీడీఓ నాగేంద్ర గ్రామీణ తాగునీటి సరఫరా అధికారి కార్తీక్, ఎలక్ట్రికల్ ఎఇ శ్రీనివాసులు రెడ్డిలతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు టీడీపీ, బిజెపి, జనసేన ముఖ్య నాయకు కార్యకర్తలు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

# ఆరెన్నెళ్లలో అందుబాటులోకి నేలటూరు ఫిషింగ్ జెట్టీ


**- జెట్టీ పనుల పరిశీలనలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**
**- పనులు పూర్తి చేసి మళ్లీ ప్రారంభోత్సవానికి వస్తామన్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**
**- పనులు పూర్తి చేయడంలో ఉన్న సమస్యలు, పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చ**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాబోయే ఆరు నెలల్లో నేలటూరు ఫిషింగ్ జెట్టీ పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నేలటూరు జెట్టీని సందర్శించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితరులు.. ఈ సందర్భంగా పనుల పెండింగ్‌పై కృష్ణపట్నం పోర్టు అధికారులతో వారు ప్రత్యేకంగా చర్చించారు. కృష్ణపట్నం పోర్టును, ప్రత్యేక బోటులో సముద్రంలోకి వెళ్లి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నేలటూరు వద్ద అసంపూర్తిగా ఉన్న ఫిషింగ్ జెట్టీ నిర్మాణ పనులను పరిశీలించి స్థానిక మత్స్యకారులతో చర్చించి చేపట్టాల్సిన పనులపై సవివరంగా మాట్లాడారు. రూ.17 కోట్లతో అదానీ కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో పనులు చేసిన విషయంతో పాటు పెండింగ్ పనులు అత్యంత త్వరగా పూర్తి చేయడం, మత్స్యకారులు రెండో జెట్టీని కోరుతున్న అంశాన్ని మంత్రి, మారిటైం బోర్డు చైర్మన్ దృష్టికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీసుకెళ్లారు. నేలటూరు ఫిషింగ్ జెట్టీని పూర్తి చేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాపై ఒత్తిడి తెస్తున్నారని, మత్స్యకారులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని ఆయన చాలా పట్టుదలతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రూ.12 కోట్ల అంచనాతో తయారు చేసిన డీపీఆర్ ప్రకారం ప్రతి పని పూర్తి చేస్తామని, ఆర్నెళ్లలో మత్స్యకారులకు జెట్టీని అందుబాటులోకి తెస్తామన్నారు. మత్స్యకారుల వినతి మేరకు రెండో జెట్టీ నిర్మాణంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇప్పుడే అధికారులకు సూచించామన్నారు. స్థానికంగా మత్స్యకారులు జెట్టీలో మౌలిక సదుపాయాల కల్పనపై తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. కృష్ణపట్నం పోర్టు ద్వారా ఇప్పటికే జెట్టీ నిర్మాణం, కనెక్టివిటీ రోడ్డు, బ్రేక్ వాటర్స్ నిర్మాణం పూర్తి చేశామన్నారు. డ్రెడ్జింగ్ అంశంలో రాష్ట్రంతో పాటు కేంద్ర ప్రభుత్వ అనుమతులు కూడా తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. కొత్తగా వచ్చిన ప్రతిపాదనలకు సంబంధించి అధికారులు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారని, అదే సమయంలో ప్రభుత్వం దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మత్స్యకారుల సూచనలన్నీ పరిగణనలోకి తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం నేలటూరుపాలెం గ్రామంలో రూ. 30.39 లక్షలతో నూతనంగా నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలో పల్లె సీమలు అభివృద్ధికి చిరునామాగా నిలుస్తున్నాయన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతూ.. ప్రజల ఇబ్బందులు తొలగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు, మత్స్యకార నాయకులు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

# టీడీపీ డైవర్షన్ రాజకీయాలపై చిన్న శ్రీను ఫైర్ - భోగాపురం భూస్కాం, రైతులపై ఒత్తిళ్లపై ఆందోళన









**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పత్రికా సమావేశం గౌరవ విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) క్యాంప్ కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సంద ర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, రాష్ట్ర రాజకీయాల్లో అసలు సమస్యలపై చర్చ జరగకుండా దారి మళ్లించే ప్రయత్నాలు జరు గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా “మావిగాన్” వంటి కీలక అంశాన్ని పక్కదారి పట్టించేందుకే మంత్రి అచ్చెన్నా యుడు అనవసరంగా దశాబ్దాల క్రితం జరిగిన విషయాలను లేవనెత్తుతున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మరణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం మళ్లీ ప్రస్తావించడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొ న్నారు. ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చించకుండా, భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. టీడీపీ నాయకులు నాటి బొత్స సత్య నారాయణ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ పార్టీ కార్యాలయంలో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం వెనుక ఉన్న ఉద్దేశం ప్రజ లను తప్పుదారి పట్టించడమేనని చిన్న శ్రీను విమర్శించారు. 15 సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలను ఇప్పుడు లేవనెత్తడం ప్రజలను మభ్యపెట్టే యత్నమేనని స్పష్టం చేశారు. “మీరు గతంలో ఇతర నేతలపై మాట్లాడిన మాటలు ప్రజలకు తెలియవా?” అని ప్రశ్నించిన ఆయన, నాటి ఎన్టీఆర్ నుండి ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ వరకు టీడీపీ నాయకులు ఉపయోగించిన భాషను ప్రజలు మరచిపోలేదని తెలిపారు. అచ్చెన్నాయుడు చేసిన “పార్టీ లేదూ, బొక్కా లేదూ” వంటి వ్యాఖ్యలు ఇప్పటికీ ప్రజల మదిలో ఉన్నాయని గుర్తు చేశారు. అదేవిధంగా పార్థసారథి, కన్నా లక్ష్మీనారాయణ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వంటి నాయకులు గతంలో చంద్రబాబు నాయుడు గురించి చేసిన విమర్శలను కూడా ప్రజలు మరిచిపోలేరని అన్నారు. ఈ నేపథ్యంలో ఒక్కపక్ష విమర్శలు చేయడం సరికాదని సూచించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పేరుతో పరిసర ప్రాంతాల్లో భారీ స్థాయిలో భూస్కాం జరుగుతోందని చిన్న శ్రీను ఆరోపించారు. వివిధ ప్రాజెక్టుల పేరుతో రైతులను బెదిరించి, ఒత్తిడి తెచ్చి వారి భూములను లాక్కునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి ప్రాజెక్టులు అమలు అయ్యే పరిస్థితి కనిపించడం లేదని, ప్రచార కార్యక్రమాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని విమ ర్శించారు.

ప్రజల సమస్యలను పక్కనబెట్టి రాజకీయ లాభాల కోసం ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదని హెచ్చరించారు. “ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని, తప్పుడు ప్రచారాలకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పే పరిస్థితి వస్తుందని చిన్న శ్రీను స్పష్టం చేశారు.” ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కెవి సూర్యనారాయణ రాజు, నెక్కల నాయుడు బాబు, జిల్లా జనరల్ సెక్రటరీలు ఇప్పలి అనంత, రవి కుమార్, నరసింహ మూర్తి, జిల్లా ఆర్.టి.ఐ విభాగ అధ్యక్షులు అప్పాన సుబ్రహ్మణ్యం, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జై హింద్ కుమార్, భోగాపురం, గరివిడి మండల పార్టీ అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ, విశ్వేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి కనకల రఘు, జిల్లా పార్టీ ఆక్టివిటీ కార్యదర్శి పోలీసు కృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# క్లస్టర్ ఇంచార్జ్ “వైకుంఠం”కి వినతి పత్రం

## - సమస్యలను పరిష్కరించడం కోసం కృషి చేస్తా : టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ “వైకుంఠం”



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని పురిటిపెంట గ్రామంలో గల రామచంద్ర నగర్ కాలనీలో రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ వైకుంఠం ప్రదీప్ కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైకుంఠం మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచిన అంశాల వలన దళిత, గిరిజన, పేద విద్యార్థులకు, విద్య అందుబాటులోకి వచ్చిందని అన్నారు. అదే విధంగా రాజ్యాంగం లో కల్పించిన అవకాశాలను వినియోగించుకొని భారతీయులందరూ అభివృద్ధి పథంలో సాగాలని వైకుంఠం ఆకాంక్షించారు. అనంతరం కాలనీ యువత కాలనీలో గల సమస్యల గురించి క్లస్టర్ ఇంచార్జ్ ప్రదీప్‌కు విన్నవించుకున్నారు. ముఖ్యంగా కాలనీలో విద్యుత్ వైర్లు, 11 కె.వి సమస్య, పూర్తిగా శిథిలమైన కమ్యూనిటీ హాల్ స్థితిని వివరిస్తూ వైకుంఠం ప్రదీప్ కుమార్‌కు యువత వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం స్వీకరించిన వైకుంఠం వినతిపత్రంలోని అంశాలను పరిశీలించి సమస్యను పరిష్కరించడం కోసం సాధ్యమైనంత వరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గేదెల ఈశ్వరరావు (పండు), గొర్లి శ్రీనివాసరావు, కాలనీ యువత, కాలనీవాసులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జీవితం భారతీయులందరికీ స్ఫూర్తిదాయకం

## - ఎస్ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు - సమసమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ - మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మానవ హక్కులు, సమా నత్వం కోసం పోరాటం చేసిన అంబేద్కర్ జీవితం భారతీయులం దరికీ స్ఫూర్తిదాయకమని గజపతినగరం ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు అన్నారు. మండలంలోని పురిటిపెంట గ్రామంలో గల రామచంద్రనగర్ కాలనీలో, కాలనీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్.ఐ కిరణ్ కుమార్ నాయుడు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ వైకుంఠం ప్రదీప్ కుమార్, మండల, గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం భారతీయులందరికీ అనుసరణీయం అన్నారు.

అదేవిధంగా అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించడం కోసం అంబేద్కర్ ఆయన జీవితాన్ని త్యాగం చేశారని కిరణ్ కుమార్ నాయుడు అన్నారు. అంబేద్కర్ త్యాగ ఫలితంగా భారతదేశ పౌరులందరం హక్కులు సాధించు కున్నాం అని ఆయన అన్నారు. యువత దేశానికి వెన్నెముక అని, అటువంటి యువత డ్రగ్స్‌కి, మత్తు పానీయాలకు, బెట్టింగు లకు అలవాటు పడి తమ జీవితాలను బలి చేసుకోవద్దని అదేవి ధంగా మితిమీరిన వేగంతో డ్రైవింగ్ చేసే ప్రాణాలు కోల్పో తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారా యణ, జడ్పిటిసి గార తౌడు, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ వైకుంఠం ప్రదీప్ కుమార్, గేదెల ఈశ్వరరావు, వైకాపా సీనియర్ నాయకులు పల్లి సంజీవరావు, బెల్లాన త్రినాధరావు, గ్రామస్తుడు గొర్లి శ్రీనివాస రావు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్లు

## - రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్
## - గజపతినగరంలో అన్న క్యాంటీన్, స్వచ్ఛ రధాలు ప్రారంభం









**గజపతినగరం, (రాజధాని వార్తలు):** పేద ప్రజల ఆకలిని తీర్చి, వారికి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడానికే ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరం, దత్తిరాజేరు మండలాలకు చెందిన స్వచ్ఛ రధాలను గజపతినగరం గ్రంథాలయం వద్ద బుధవారం మంత్రి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను కూడా మంత్రి ప్రారంభించారు. స్వయంగా ఆహార పదార్థాలను వడ్డించడమే కాకుండా, భోజనాన్ని రుచి చూసి, నాణ్యతను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 61 అన్నా క్యాంటీన్లను గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా పునఃప్రారంభించడం జరిగిందని చెప్పారు. ఇందులో భాగంగా గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో కూడా ఒక అన్న క్యాంటీన్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలో ఈ రోజు కొత్తవలస, గజపతినగరం చీపురుపల్లిలో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఒక్కో అన్న క్యాంటీన్‌ను సుమారు రూ.61 లక్షల వ్యయంతో నిర్మించగా, జిల్లాలోని ఈ మూడు క్యాంటీన్ల కోసం మొత్తం రూ.1.83 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. పేద ప్రజలకు, పని నిమిత్తం పట్టణాలకు వచ్చే కూలీలకు కేవలం 5 రూపాయలకే నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. ముఖ్యంగా ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులకు ఈ క్యాంటీన్లు ఎంతో ప్రయోజ నకరంగా ఉంటాయని, ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచడానికి స్వచ్ఛరథాలు దోహదపడతాయని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏ.ఎం.సి ఛైర్మన్ గోపాలరాజు, జనసేన రాష్ట్ర పిఎసి సభ్యురాలు పడాల అరుణ, డి.పి.ఓ మల్లికార్జునరావు, పబ్లిక్ హెల్త్ ఈ.ఈ జ్యోతి, గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కరావు తదితర కూటమి నాయకులు, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగోన్నతితో మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలి

## - విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్






**మక్కువ, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా పోలీసుశాఖ సివిల్ విభాగంలో హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళుగా పని చేస్తున్న 21మంది పోలీసు సిబ్బందికి ఎఎస్ఐలు మరియు హెడ్ కానిస్టేబుళ్ళుగాఉద్యోగోన్నతులను కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సంబంధిత పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఏప్రిల్ 15న జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసి, ఉద్యోగోన్నతులు పొందిన సిబ్బందికి జిల్లా ఎస్పీ స్వీట్స్‌ను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగోన్నతులు పొందిన ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి, తమ ఆనందాన్ని, సంతోషాన్ని వ్యక్తం చేసి, జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో సేవలందించి ఉద్యోగోన్నతులు పొందిన ఆరుగురు ఎఎస్ఐలు, 15 మంది హెడ్ కానిస్టేబుళ్ళను (మొత్తం 21 మంది) జిల్లా ఎస్పీ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా వారి సేవలు, క్రమశిక్షణ, పనితీరు మరియు సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు ఇవ్వడం జరిగిందన్నారు. పోలీసుశాఖలో ఉన్నతమైన బాధ్యతలు నిర్వహించడానికి ఉద్యోగోన్నతితో అవకాశం లభిస్తుందన్నారు. ప్రజలకు సేవలందించడంలో మరింత భాధ్యతతో, నిబద్ధతతో పని చేయాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, అప్పగించిన భాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి, జిల్లా పోలీసు శాఖకు మంచి పేరును తీసుకొని రావాలన్నారు. ఉద్యోగోన్నతి పొందిన వారికి ఖాళీలను బట్టి త్వరలో బదిలీలు చేస్తామన్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు జిల్లా పోలీస్ శాఖలో ఏర్పడిన ఖాళీలను ఎప్పటికప్పుడు అర్హతలను బట్టి ఉద్యోగోన్నతలు కల్పించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ ఎ. ఆర్.దామోదర్ తెలిపారు.

ఉద్యోగోన్నతులు ఎఎస్ఐ కే.త్రినా ధరావు మరియు హెడ్ కానిస్టేబులు సిహెచ్.శ్రీను మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖలో ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి ఉద్యోగోన్న తులు కల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలీసుశాఖ పట్ల చూపిస్తున్న శ్రద్ధ మరువలేనిదని, ఈ పదోన్నతులు రావటానికి కారకులైన గౌరవ హోంశాఖామాత్యులు వంగలపూడి అనితకి, గౌరవ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఐపిఎస్‌కి, గౌరవ విశాఖపట్నం రేంజ్ ఐజిపి గోపీనాథ్ జట్టి, ఐపిఎస్‌కి మరియు విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్‌కి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిపిఒ ఎఓ పి.శ్రీనివాసరావు, సూపరింటెం డెంట్ వెంకటలక్ష్మి, జూనియర్ సహాయకురాలు చాముండేశ్వరి, డిఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎస్.రాఘవులు, ఎం.వీరకుమార్, పలువురు సిఐలు, ఎస్ఐలు, జిల్లా పోలీస్ శాఖ అర్బక్ ప్రెసిడెంట్ కే.శ్రీనివాసరావు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

**9440662699, rajadhanivartalu.com**

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

**RAJADHANIVARTALU.COM**
**9440662699**

# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**- పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు : ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు టి.జానకి**





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని అనేక గ్రామాలలో గల అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గజపతినగరం ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ ఎస్.లింగాలవలస సెక్టార్ పర్యవేక్షకురాలు టి.జానకి గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3-6 సంవత్సరాల వయసుగల పిల్లల తల్లులకు ఆట ఆధారిత విద్య మరియు పిల్లల సమగ్ర విద్య అభివృద్ధికి ఆటలు ఉపయోగం గూర్చి వివరించారు. జిన్నాం, తుమ్మికాపల్లి, పి.ఎస్.ఆర్.పురం, సీతారాంపురం, మల్లు నాయుడుపేట, ముచ్చర్ల గ్రామాలలో గల అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు లక్ష్మీ, తిరుపతమ్మ, జయలక్ష్మి, సుభాషిణి, నరసమ్మ, సన్యాసమ్మ, ఈశ్వరమ్మ, పద్మ, పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల భద్రతే మా ప్రాధాన్యత

**- పుష్ కార్టులు, రక్షణ పరికరాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందరావు**

**- అమలాపురం పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే ఆనందరావు**

**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణాన్ని పారిశుద్ధ్యంలో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన పారిశుద్ధ్య పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 1 నుండి 30 వార్డులలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచడానికి సుమారు రూ.10 లక్షల రూపాయల వ్యయంతో 50 పుష్ కార్టులను, అలాగే రూ.5 లక్షల రూపాయల వ్యయంతో 350 డస్ట్ బిన్నులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అందులో భాగంగా రూ.3 లక్షల రూపాయల వ్యయంతో వారికి రేడియం జాకెట్లు, గ్లౌజ్‌లు, మాస్కులను కార్మికులకు ఆయన అంద జేశారు. పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న మహిళలను ప్రోత్సహించే దిశగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో పలు కీలక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కిచెన్ గార్డెన్స్, టెర్రాస్ గార్డెన్స్ నిర్వహిస్తూ హోమ్ కంపోస్ట్ ద్వారా మొక్కలను పెంచుతున్న మహిళలకు రూ.75 వేల రూపాయల విలువైన 62 కంపోస్ట్ బిన్నుల కిట్లను పంపిణీ చేశారు. అమలాపురం పట్టణాన్ని సుందరంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ప్రతి ఇంట్లోనూ తడి-పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మున్సిపల్ చైర్మన్ నిర్మల్ కుమార్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి







**కొత్తవలస, (విజయనగరం), (రాజధాని వార్తలు):** పేద ప్రజల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్తవలస మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎంపీ శ్రీ భరత్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారితో కలిసి బుధవారం ప్రారంభించారు. అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం, కలెక్టర్ స్వయంగా అక్కడే భోజనం చేశారు. ఆహార పదార్థాలను రుచి చూసి, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సామాన్యులకు, నిరుపేదలకు తక్కువ ధరకే నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడమే ఈ క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఆహార తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు, సామాన్య ప్రజలకు అన్నా క్యాంటీన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి సంక్షేమ పథకాలు పేదరికాన్ని నిర్మూలించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా క్యాంటీన్ సేవలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా, మెరుగైన సౌకర్యాలతో ఈ కేంద్రం పనిచేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఇ. మురళి, మండల అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పెద్దాపురం అగ్నిమాపక కేంద్రం అధికారుల ఆధ్వర్యంలో సామర్లకోట పెద్దాపురం పట్టణాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టే అప్రమత్త చర్యలపై మాక్ డ్రిల్ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం పెద్దాపురం అగ్నిమాపక అధికారి ఆధ్వర్యంలో పెద్దాపురం గుర్రాల సెంటర్ వద్ద, దర్గా నగర్ సెంటర్లోనూ, మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, సామర్లకోట పట్టణంలో ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం సెంటర్లో, మెహర్ కాంప్లెక్స్ సెంటర్లో, మఠం సెంటర్ లోనూ, స్టేషన్ సెంటర్ గడియార స్తంభం వద్ద, రైల్వే స్టేషన్, ఆర్టిసి బస్టాండ్ కోడలి వద్ద ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది ఏ విధంగా వాటిని అదుపు చేసేందుకు చర్యలు చేపడతారో ఆ విషయాలను ప్రయోగాత్మకంగా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎల్ఎఫ్‌లు పిఆర్ఆర్ ప్రసాద్, పి సత్యనారాయణ, కె వివి సత్యనారాయణ, బి బుజ్జి, డిఓపి ఎండి యాకుబ్, ఎఫ్ఎంలు కె రామచంద్రరావు, ఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan